సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.778 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 52.778 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 480 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.91,570
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,310
3శాతం జీఎస్టీతో	రూ.8,559
నవర (8గ్రా)	రూ.68,472

గరిష్టం/కనిష్టం
37.0 /27.0

వాతావరణం

సోమవారం జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

డైట్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఇందుకూరుపేట: పల్లిపాడులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో 2025–26 విద్యా సంవత్సరంలో డిప్యూటేషన్‌పై (ఎఫ్ఎస్‌టీసీ) అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కే వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 22 సాధారణ అధ్యాపకులు, 5 ఉర్దూ అధ్యాపకులు కలిపి మొత్తం 27 ఉపన్యాసక పోస్టులు ఉన్నాయన్నారు. 58 ఏళ్ల లోపు, 5 ఏళ్ల అనుభవం, సంబంధిత సబ్జెక్ట్‌ల్లో 55 శాతం మార్కులు కలిగిన విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఈ నెల 16, 17వ తేదీల్లో రాత పరీక్ష నిర్వహిస్తామని, 19వ తేదీ జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి ఎస్ఏ-2 పరీక్షలు

దుత్తలూరు: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సోమవారం నుంచి సమ్మేటివ్-2 పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,595 ప్రభుత్వ పాఠశాలలు, 812 కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో సుమారు 1.90 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు 6 నుంచి 9వ తరగతి వరకు, ఈ నెల 9 నుంచి 1 నుంచి 5వ తరగతి వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అన్ని మండల విద్యావనరుల కేంద్రాలకు ఎస్ఏ-2 పరీక్ష పత్రాలు చేరాయి. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా వాటిని విభజించి ప్రశ్నపత్రాలు పంపిణీ చేశారు. పరీక్ష సమయానికి గంట ముందుగా సంబంధిత ఉపాధ్యాయులు వాటిని పాఠశాలలకు అందించాలి. ప్రాథమిక తరగతుల వారికి అయితే ఆయా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు అందించాలి.

ఆడిట్ రికవరీ

ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అధికారుల అక్రమాలు

- ఇంటర్నల్ ఆడిటింగ్‌లో వెల్లడైన రిజిస్ట్రేషన్ శాఖ అవినీతి
- అది రూ.20 కోట్ల పైగానే ఉంటుందని అంచనా
- జిల్లాలో సబ్ రిజిస్ట్రార్లపై రూ.4 కోట్ల వరకు జరిమానాలు
- ఆడిట్ అధికారులను మేనేజ్ చేయడంతో తగ్గిన రికవరీ మొత్తం
- గతంలో కాగ్ కడిగేసినా మారని అధికారుల తీరు

జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు 'అవినీతి' పేటెంట్ హక్కుగా మారింది. ఈ శాఖలో అవినీతిని అరికట్టడం 'అవినీతి నిరోధక శాఖ'కే సాధ్యపడడం లేదు. ఇటీవల జిల్లాలోని కావలి సబ్ రిజిస్ట్రార్ మధ్యంతర బదిలీ అయిన తర్వాత ఆ పోస్టులో చేరేందుకు అక్షరాల కోటిన్నర రూపాయలు ముడుపులు ముట్టచెప్పుకుని ఆ సీటులో మరో సబ్‌రిజిస్ట్రార్ తిష్టవేశారంటే అవినీతి ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనక్కర్లేదు. ఈ శాఖలో అక్రమాల లెక్కల బొక్కలు తేల్చాల్సిన ఇంటర్నల్ ఆడిట్ విభాగం సైతం అవినీతిలో కూరుకుపోయిందనే విమర్శలు వస్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, ఇంటర్నల్ ఆడిటింగ్ విభాగం అవినీతిలో జోడు గుర్రాల సవారీ చేస్తున్నాయి. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీల్లో అక్రమాలను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చాల్సిన ఆడిట్ విభాగం అవినీతిలో మునిగి తేలుతోంది. ప్రతి నెలా ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించాల్సిన విభాగం ఆడిటింగ్ పేరుతో మామూళ్లు వసూలు చేసుకుని జల్సాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ శాఖల అధికారులను రిజిస్ట్రేషన్ల వివరాలు, ఆడిటింగ్ రికవరీల నివేదికలు కావాలని రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా స్థాయి అధికారిని అడిగితే ఇచ్చేది లేదంటూ మీడియా ప్రతినిధిపై దూషణలకు దిగాడు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తాను.. అప్పుడైనా ఇస్తారా అంటే.. అప్పుడు కూడా ఇచ్చేది లేదు. ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండంటూ సీరియస్ అయ్యాడు. ఏసీబీ అధికారులకు చెబుతారా? ..చ్చు కూడా ఊడదంటూ ఆవేశంతో ఊగిపోయాడు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల తీరు చూస్తుంటే వారి వెనుక ఆ శాఖా ఉన్నతాధికారుల నుంచి స్థానిక ఎమ్మెల్యేల అండ ఉందనేది మీకు అర్థం కావడం లేదా అని ఓ డాక్యుమెంట్ రైటర్ వ్యాఖ్యానించడం గమనార్హం.

ఆ శాఖల్లో ఏం జరుగుతోంది

జిల్లాలో రిజిస్ట్రార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, మార్ట్‌గేజ్, సవరణ లీజు అగ్రిమెంట్, వీలునామా, జీపీఏ కమ్ సేల్, జనరల్ పవర్, రెంటల్ అగ్రిమెంట్ తదితరాలకు సక్రమంగా స్టాంప్ డ్యూటీ చెల్లించారా? లేదా? అనేది ఇంటర్నల్ ఆడిటింగ్ విభాగం చూడాలి. చెల్లింపుల్లో తేడా ఉన్నట్లు తేలితే వెంటనే పెనాల్టీ వేసి, సబ్ రిజిస్ట్రార్‌కు నోటీసు పంపిస్తారు. మార్కెట్ విలువ ప్రకారమే స్టాంప్ డ్యూటీ సక్రమంగా చెల్లించి ఉంటే జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ వద్ద అప్పీల్ చేసుకుని సరిచేసుకోవచ్చు. స్టాంప్ డ్యూటీ చెల్లింపులో నిజంగా తేడా ఉంటే సబ్‌రిజిస్ట్రార్, డాక్యుమెంట్ ఓనర్‌కు పెనాల్టీ చెల్లించాలని నోటీసు ఇస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ ఆడిట్ విభాగం అధికారులు డాక్యుమెంట్లపై అభ్యంతరాలు ఉన్నాయని సాకు చూపుతూ భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ సంగతి!

'రాపూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఓ భూమి తనఖాలో ఉంది. ఈసీలో కూడా తనఖాలో ఉన్నట్లు చూపిస్తోంది. కానీ అక్కడ పనిచేసే సబ్ రిజిస్ట్రార్ మాత్రం అవేమి పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ చేశాడు. సంబంధిత డాక్యుమెంట్ రైటర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికప్పుడు తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు సబ్‌రిజిస్ట్రార్ సొంత నగదు చెల్లించాల్సి వచ్చింది. ఒకవేళ ఫిర్యాదు చేయకుంటే అధికారులు పట్టించుకోనే పరిస్థితి ఉండేది కాదు'

రూ.20 కోట్ల మేర తేడాలు.. రూపాయి చెల్లించని వైనం

జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొన్నేళ్లుగా జరుగుతున్న ఇంటర్నల్ ఆడిటింగ్‌లో స్టాంప్ డ్యూటీ తేడాలు గుర్తించి దాదాపు రూ.20 కోట్ల వరకు లెక్కలు తేల్చినట్లు సమాచారం. అయితే ఆయా సబ్ రిజిస్ట్రార్లు పెద్ద మొత్తాల్లో ముడుపులు ఇచ్చుకోవడంతో ఈ అవినీతిని రూ.4 కోట్లకు తగ్గించినట్లు ఆ శాఖలోని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఏళ్లు గడుస్తున్నా కానీ ఈ రూ.4 కోట్లలో నాలుగు రూపాయలు కూడా రికవరీ చేయలేదు, అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులు, అధికారులపై శాఖాపరమైన చర్యలూ తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆడిటింగ్ చేయడంలో జాప్యం

గతంలో ఉద్యోగ విరమణ చేసిన ఆడిటింగ్ జిల్లా అధికారి విధుల్లో ఉన్న సమయంలో అవినీతి ఎక్కువగా జరిగినట్లు కాగ్ నివేదికలో పేర్కొంది. జిల్లాలో పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇంటర్నల్ ఆడిటింగ్ చేయకుండా జాప్యం చేయడం, చేయి తడిపిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆడిటింగ్ పెనాల్టీలు లేకుండా సరిచేసినట్లు ఉదహరించింది. మిగిలిన కార్యాలయాల్లో మాత్రం ఆడిటింగ్ చేయకుండా నెట్టుకొస్తున్నారు. అధికారులు అవినీతి వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందన్న ఆరోపణలున్నాయి. గతంలో నెల్లూరులోని ఆర్ఓ పరిధిలో దాదాపు 318 డాక్యుమెంట్లకు స్టాంప్ డ్యూటీలో తేడాలున్నట్లు అప్పట్లో నిర్ధారణ చేశారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేట, బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరులో భారీ సంఖ్యలో డాక్యుమెంట్లలో తేడాలున్నట్లు గుర్తించారు. స్టోన్‌హౌస్‌పేట రిజిస్ట్రార్ కార్యాలయంలో 136 డాక్యుమెంట్లు తేడాలున్నట్లు నిర్ధారించినా రికవరీలు మాత్రం చేయలేదు. ఉదయగిరి, వింజమూరు, అల్లూరు, ఆత్మకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలాకాలం నుంచి అసలు ఆడిటే జరగలేదని తెలుస్తోంది.

చిదంబర రహస్యంగా ఆడిట్ రిపోర్టులు

ప్రభుత్వ శాఖల్లో జరిగే ప్రతి వ్యవహారం అందరికి తెలిసేలా ఉంచాలి. కానీ జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు మాత్రం రికవరీల విషయాన్ని మీడియాకు వెల్లడించకుండా రహస్యంగా ఉంచుతున్నారు. అధికారులు చేసిన తప్పిదాలు వెలుగులోకి వస్తే ఉన్నతాధికారుల నుంచి ఇబ్బందులు తప్పవన్న కారణంతో వివరాలు వెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు.

ముడుపులివ్వకపోతే పెనాల్టీలు

జిల్లాలో నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ, దేవదాయ భూములను సైతం సబ్‌రిజిస్ట్రార్లు కాసుల కోసం రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. నెల్లూరు రూరల్ ప్రాంతంలో డీకేటీ ప్రభుత్వ పట్టా ఇంటి స్థలాన్ని ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని చెప్పడంతో సూళ్లూరుపేటకు వెళ్లి అక్షరాలా రూ.లక్షన్నర ఇచ్చి అక్కడి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇక్కడి లోకల్ సబ్ రిజిస్ట్రార్ ఆ డాక్యుమెంట్‌కు క్లియరెన్స్ ఇచ్చారు. ఇలాంటి నిషేధిత, వివాదాస్పద భూములకు సంబంధించి.. స్థానికంగా కాకుండా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ విధానాన్ని ఎంచుకుని ఆ ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అక్రమాలను నెలవారీగా ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించి నిగ్గు తేల్చాల్సిన అధికారులు ఆయా రిజిస్ట్రేషన్లకు రేటు ఫిక్స్ చేసి వసూళ్లు చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఆడిట్ సిబ్బందికి చేయి తడపకపోతే పెనాల్టీ పేరుతో భయపెట్టి వసూలు చేసుకుంటున్నారు. స్టాంప్ డ్యూటీ చెల్లింపుల్లో తేడా లున్నా కూడా చేయి తడిపితే సరి చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.



ఆర్డీఓ కార్యాలయంలో రైతులు (ఫైల్)

మార్చి 6వ తేదీ

కొద్ది రోజులు ఆగండి..

జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు నుంచి హైదరాబాద్ వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పెట్రోలియం పైపులైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పైప్‌లైన్ కావలి మండలంలోని ఆనెమడుగు, సర్వాయపాళెం పంట పొలాల మీదుగా వెళ్లాల్సి ఉంది. ఆ భూముల్లో పంట చివరి దశలో ఉంది. బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణ సంస్థ దౌర్జన్యంగా పైప్‌లైన్ వేసేందుకు ముందుకు వచ్చింది. ఆ సమయంలో అడ్డుకున్న రైతులు కొద్ది రోజుల పాటు ఆగండి.. పంట పూర్తవుతుంది.. మీరు పైప్‌లైన్ వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది ఉండదంటూ కావలి ఆర్డీఓ ఎం.సన్ని వంశీకృష్ణతో మొరపెట్టుకున్నారు. అక్కడే ఉన్న బీపీసీఎల్ ప్రతినిధులు మాత్రం తాము పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, పంట నష్టం జరిగితే పరిహారం ఇస్తామంటూ నిర్లక్ష్యంగా చెప్పారు. చివరకు ఆర్డీఓ సైతం బీపీసీఎల్ ప్రతినిధుల మాటనే చెప్పడంతో రైతులు ఆవేదనతో బయటకు వచ్చేశారు. బీపీసీఎల్ సంస్థ గ్రామాల్లోకి వచ్చి భయోత్పాతం సృష్టించి, సన్నకారు రైతులు భూముల్లో నడి మధ్యన పైప్ లైన్ వేసి పొలాలను ధ్వంసం చేస్తామంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్పొరేట్ కర్కశం అన్నదాత ఆక్రోశం

బతుకు వేదనలో రైతులు

- బిల్లుల ఆరాటంలో బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ

కార్పొరేట్ సంస్థ తలుచుకుంటే ప్రభుత్వ వ్యవస్థ గులాంగిరి చేయాల్సిందే. కాలే కడుపులకు పిడికెడు అన్నం పెట్టే అన్నదాతను ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు బతికుండగానే నిర్జీవులను చేస్తున్నాయి. ఒకరిది మెతుకు వేటలో సాగే బతుకు. మరొకరిది నోట్ల కట్టలతో ఇనుప పెట్టెలు నింపుకునే ఆట. కార్పొరేట్ కర్కశత్వ యంత్రాల కింద నలిగిపోతున్న అన్నదాతల ఆక్రోశం జిల్లా యంత్రాంగానికి వినిపించడం లేదు. మరో పది రోజుల్లో కోతలు పూర్తయ్యే దశలో ఉన్న పంటను కార్పొరేట్ యంత్రాలు తమ కళ్లముందే ధ్వంసం చేస్తుంటే.. అన్నదాతలు కన్నీటి ధారలు విడవడం తప్ప మరేమి చేయలేక నిస్సహాయంగా ఉండిపోయారు.

కావలి: గ్రామ రెవెన్యూ నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అడుగడుగునా అమ్ముడుపోయింది. ఆరుగాలం రెక్కల కష్టంతో శ్రమించి చేతికి వచ్చే దశలో ఉన్న పంటను కాపాడమని నెల రోజులుగా రైతులు అధికారులకు మొరపెట్టుకున్నారు. మరో పది రోజుల్లో పంట కోతలు పూర్తయ్యాక పనులు చేసుకోమని అధికారుల కాళ్లా వేళ్లా పడ్డారు. బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. రోడ్డెక్కి ఆందోళనల బాట పట్టారు. అయినా అధికారులు కరుణించలేదు. కార్పొరేట్ సంస్థ కనికరించలేదు. మరో పది రోజుల తర్వాత ఎవరికీ అభ్యంతరం లేకపోయినా.. అంతకాలం ఆగలేకపోయారు. కార్పొరేట్ సంస్థ ఇనుప యంత్రాలు కింద పండిన పంట ధ్వంసం అయింది. కార్పొరేట్ విసిరిన పంజా కింద కావలి మండలం సర్వాయపాళెం, ఆనెమడుగు రైతులు విలవిలలాడిపోతున్నారు.



ఈ పొలాల మీదుగానే పైప్ లైన్ నిర్మాణం



పొలాల్లో పైప్‌లైన్ వేయడానికి సిద్ధంగా ఉన్న పైప్‌లు

బిల్లుల కోసమే ఈ దాష్టీకం

పైప్‌లైన్ నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులు కోసం భారీగానే పెట్టుబడులు పెట్టింది. పనులు సకాలంలో పూర్తయితేనే కాంట్రాక్ట్ సంస్థకు బీపీసీఎల్ సంస్థ బిల్లులు చెల్లింపులు చేస్తుంది. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థకు బీపీసీఎల్ బిల్లులు చెల్లించడంలేదు. దీంతో ఎలాగైనా పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలనే లక్ష్యంతోనే కాంట్రాక్ట్ సంస్థ దాష్టీకాన్ని ప్రదర్శిస్తోంది. అధికార యంత్రాంగాన్ని సైతం నోట్ల కట్టలతో నోర్లు మూయించిందని రైతులు ఆరోపిస్తున్నారు. వరి కోతలు పూర్తయిన అల్లిగుంటపాళెంలో ఉన్న పొలాల్లో పైప్ లైన్ నిర్మాణ పనులు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ కాంట్రాక్ట్ నిర్మాణ సంస్థ వరి కోతలు పూర్తి కాని పొలాలను ధ్వంసం చేసి మరీ పైప్‌లైన్ నిర్మించే మొండితనాన్ని ప్రదర్శిస్తున్న తీరు పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏప్రిల్ 5వ తేదీ

పంటను ధ్వంసం చేస్తూ..

కార్పొరేట్ సంస్థ అనుకున్న విధంగానే పంటను ధ్వంసం చేస్తూ మండలంలోని సర్వాయపాళెం, ఆనెమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న సర్వాయపాళెం, అల్లిగుంటపాళెం, మాతినివారిపాళెం, కోనేటివారిపాళెం పొలాల్లో యంత్రాలు పెట్టి బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణ పనులు మొదలు పెట్టింది. పంటలు ధ్వంసం చేసి అయినా.. పైప్‌లైన్ వేసి తీరతామన్న కార్పొరేట్ సంస్థ పంతం నెగ్గించుకుంది. కోతకు సిద్ధంగా ఉన్న పంట పొలాలను పొక్లయిన్‌తో తొక్కుకుంటూ సర్వ నాశనం చేస్తుంటే అన్నదాతలు గుండెలు బాదుకుంటూ కన్నీటి పర్యంతంగా చూస్తూ నిలబడిపోయారు.



ధ్వంసమైన కోతకు వచ్చిన వరి

వ్యవసాయాన్ని మట్టుపెట్టే కుట్ర



ఆరుగాలం కష్టపడిన అన్నదాతల పంట ప్రకృతి విపత్తులతో నష్టపోతే ఆదుకోవాల్సిన ప్రభుత్వం యంత్రాంగమే ఒక కార్పొరేట్ సంస్థ స్వార్థానికి పంటను ధ్వంసం చేస్తుంటే చూస్తూ ఉండిపోవడం దారుణం. ఇది వ్యవసాయాన్ని మట్టుపెట్టే కుట్రగా అనిపిస్తోంది. ఈ దుస్సాహసం క్షమార్హం కానిది. బీపీసీఎల్ పైప్‌లైన్ నిర్మాణం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థకు రైతుల పొలాలను ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారు. అసలు ఆ సంస్థకు అంత ధైర్యం ఎలా వచ్చింది. ఈ విషయంలో అధికారులు నోరు విప్పక పోవడం వెనుక ఏ శక్తులు పని చేస్తున్నాయి. అంతిమంగా రైతుల కంట కన్నీరు కార్చే చర్యలకు పాల్పడటం మరింత విషాదకరం.

– తాళ్లూరు మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు, కావలి



నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవం

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పలు ఆలయాల్లో ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల హోరులో వేలాదిగా తరలివచ్చిన భక్తజనం మధ్య జైశ్రీరామ్.. జయ జయ రామ.. జానకిరామ.. జయహో శ్రీరామచంద్ర.. గోవిందా.. గోవిందా.. నామ స్మరణతో ఆలయాలు పులకించాయి.

- వీక్షించి.. పరవశించిన భక్తజనం
- కిటకిటలాడిన రామాలయాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రామ్‌నగర్ శబరి శ్రీరామక్షేత్రం ఎదురుగా ఉన్న శ్రీరామకోటి స్థూప ప్రాంగణం సీతారాముల కల్యాణ వేడుకతో పులకించింది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో శ్రీరామకోటి స్థూప ప్రాంగణం కిటకిటలాడింది. తొలుత పల్లకిలో సీతాదేవి, కోదండరాములు శబరి శ్రీరామ క్షేత్రం నుంచి కల్యాణ వేదికకు మేళతాళాలు, భక్తుల రామనామస్మరణ నడుమ తరలివచ్చి కొలువుదీరారు. వరుడి తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి– సుజిత దంపతులు సమర్పించారు. అర్చకుడు వేదాంతం నరేష్ ఆచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కన్యాదానం, మాంగల్యపూజ, అమ్మవారికి మాంగల్య ధారణ తంతును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీరామకోటి యజ్ఞస్థూప ప్రాంగణంలోనే భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉభయకర్తలుగా పిడూరు కిశోర్‌రెడ్డి– శరణ్య, భానుప్రకాష్‌రెడ్డి– నాగమణి దంపతులు వ్యవహరించారు. కల్యాణ మహోత్సవం అనంతరం స్వామివారికి సమర్పించిన ముత్యాల తలంబ్రాలు, అక్షతలను భక్తులకు అందజేశారు. డీటీసీ చందర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమాలను శబరి శ్రీరామక్షేత్రం భక్తబృందం, కమిటీ నిర్వాహకులు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, రఘునాథరాజు, వెంకురెడ్డి, చంద్రారెడ్డి, దయాకర్‌గౌడ్, దద్దోలు రమణయ్య, రామ్‌నగర్ మిత్రమండలి తదితరులు పర్యవేక్షించారు. కాగా గతేడాది నుంచి శ్రీరామచంద్రుడిని స్మరిస్తూ భక్తులు రాసిన శ్రీరామకోటి పుస్తకాలను ప్రాంగణంలోని స్థూపంలో ఆదివారం సాయంత్రం నిక్షిప్తం చేశారు.



సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించి తరిస్తున్న భక్త జనం

➡ కొద్దిరోజుల క్రితం నెల్లూరు విక్రమ్ నగర్‌లోని సీసీ కెమెరాల దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆరుగంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భారీగా ఆస్తి నష్టం జరిగింది.

➡ ఇటీవల చెత్తాచెదారాలు తగులబడి పక్కనే ఉన్న టిప్పర్లు దగ్ధమైన ఘటన నెల్లూరులో జరిగింది. ప్రమాదవశాత్తు అగ్గి రాజుకుందో? లేక ఆకతాయిలు తగులబెట్టారో తెలియదు గానీ చెత్తాచెదారాలు తగులబడి పక్కనే ఉన్న టిప్పర్లకు నిప్పంటుకుంది.

➡ గత వారంలో పొదలకూరు మండలంలో భారీ సంఖ్యలో గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో రైతులు నష్టపోయారు.

నిప్పు.. ముప్పు

- చిన్న పొరపాట్లే అగ్నిప్రమాదాలకు కారణాలు
- జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట ఘటనలు
- అప్రమత్తత చాలా అవసరం
- 14 నుంచి వారోత్సవాలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): వేసవి తీవ్రరూపం దాల్చింది. ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో జిల్లాలో రోజూ ఏదోఒక చోట అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో మంటలు క్షణాల్లో వ్యాప్తిచెంది స్పందించే లోపే ఘోరం జరిగే ప్రమాదముంది. కొద్దిపాటి నిర్లక్ష్యంతో ఆస్తి, ప్రాణనష్టం చవిచూడాల్సి వస్తుంది. ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని అధికారులు సూచిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆ శాఖ సిద్ధమవుతోంది. ఈనెల 14 నుంచి వారోత్సవాలు నిర్వహించనుంది.

ఏ సందర్భంలో ఏం చేయాలంటే..

గ్యాస్ స్టవ్‌ను నేలమట్టానికి వీలైనంత ఎత్తులో ఉంచుకోవాలి. అగ్గిపెట్టెలు, కిరోసిన్, క్యాలెండర్లు, వస్త్రాలు, మండే స్వభావం కలిగిన వస్తువులను దానికి దూరంగా ఉంచాలి. అలాగే వంట చేసే సమయంలో వదులుగా, వేలాడే వస్త్రాలు ధరించరాదు. అగ్గిపుల్ల లేదా లైటర్‌ను వెలిగించిన తర్వాత మాత్రమే గ్యాస్ బర్నల్ నాబ్‌ను తిప్పాలి. గ్యాస్ లీకైతే భయపడరాదు. వెంటనే రెగ్యులేటర్‌లు ఆపేయాలి. ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదు. గాలి, వెలుతురు కోసం కిటికీలు, తలుపులను తెరవాలి. గ్యాస్ లీక్ వల్ల అగ్నిప్రమాదం సంభవిస్తే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్ చేయాలి. ఆ అవకాశం లేకపోతే తడిపిన గోతాం పట్టను లేదా తడి బట్టను మండుతున్న సిలిండర్‌పై వేయాలి. మంట ఆగిపోతుంది. దానిని ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లాలి.



ఇటీవల సీసీ కెమెరాల దుకాణంలో జరిగిన అగ్నిప్రమాదం

వాహన ప్రయాణంలో..

కారులో లేదా ఇతర వాహనాల్లో సుదూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో వాహనంపై అధిక ఉష్ణోగ్రతలు ప్రభావం చూపే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్ ట్యాంక్‌ను పూర్తిగా నింపడం ప్రమాదకరం. అధికవేడి ప్రభావంతో ట్యాంక్‌లో గ్యాస్ వ్యాకోచం చెంది ట్యాంక్ పేలిపోయే అవకాశం ఉంది. గంటల తరబడి ప్రయాణించినప్పుడు ఇంజిన్ వేడెక్కడం, వాహనంలోని వైరింగ్ కాలిపోవడంతో అకస్మాత్తుగా మంటలు వ్యాపిస్తాయి. బ్యాటరీ, ఫ్యూజ్, విద్యుత్ వైర్లు నాణ్యమైనవి వాడాలి. వైరింగ్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. మధ్యాహ్న వేళల్లో వాహనానికి తగినంత విరామం ఇచ్చి ప్రయాణించడం ఉత్తమం.

విద్యుత్ పరికరాలతో జాగ్రత్త

విద్యుత్ కారక అగ్నిప్రమాదాల నివారణకు నిపుణుల పర్యవేక్షణలో పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఐఎస్సై మార్క్ కలిగిన ఉపకరణాలను మాత్రమే వినియోగించాలి. లోపభూయిష్టమైన విద్యుత్ ఉపకరణాలను తక్షణమే మరమ్మతులు చేయించాలి లేదా మార్చేసి సక్రమమైన వాటిని తీసుకోవాలి. అతుకులుండే విద్యుత్ తీగలను, లూజ్ వైరింగ్‌ను ఉపయోగించరాదు. అధిక ఓల్టేజీ విద్యుత్ ఉపకరణాలకు, త్రీపిన్ సాకెట్స్‌కు ఎర్త్‌ను తప్పనిసరిగా వాడాలి. ల్యాప్‌ట్యాప్, సెల్ ఫోన్ చార్జింగ్‌లను బెడ్ దగ్గర పెట్టుకోరాదు. విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే నీళ్లతో ఆర్పరాదు. దీంతో కరెంట్ షాక్ తగిలి ప్రాణాపాయం కలగొచ్చు. షాక్‌కు గురైన వ్యక్తికి అధిక మోతాదులో నీటిని ఇవ్వాలి. ఇంటికి దూరంగా ఎక్కువ సమయం ఉండాల్సి వస్తే విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి.

దూరం ఉండాలి

గ్రామాల్లో వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలి. గుడిసెలకు మధ్య కనీస దూరం ఉండాలి. బహిరంగ మంటలను అనుమతించరాదు. దీంతో నిప్పురవ్వలు పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యుత్ తీగలకు దగ్గర్లో గడ్డివాములు ఏర్పాటు చేయరాదు. ఏదైనా గుడిసెకు నిప్పంటుకుంటే పక్కనే ఉన్న గుడిసెలు, పూరిళ్లు, గడ్డివాములను పూర్తిగా నీళ్లతో తడపాలి. పంట పొలాల్లో నూర్పిడి అయిన తర్వాత ఎండుగడ్డి, పొడి మొక్కజొన్న, చొప్పదంటు తదితరాలను తగులబెట్టే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. గడ్డివాములను చిన్నవిగా ఏర్పాటు చేసుకుంటే మంచిది.

అత్యవసర వేళల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కేంద్రం	కార్యాలయ	అధికారి
నెల్లూరు	0861 – 2331051	99637 34284
కావలి	8626 – 243101	99637 34286
వింజమూరు	08629 – 249101	99637 35446
ఉదయగిరి	08620 – 229251	99637 35314
మర్రిపాడు	08620 – 210111	99637 44817
ఆత్మకూరు	08627 – 221222	99637 34394
పొదలకూరు	08621 – 225202	99637 34828
రాపూరు	08621 – 226145	99637 35094
కందుకూరు	08598 – 223399	99637 33252

ఇక్కడిలా..

విద్యాసంస్థలు, బహుళ అంతస్తుల భవనాలు, హాస్పిటళ్లలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర మార్గాలకు, ఫైర్ డోర్లకు తాళాలు వేయకూడదు. ఎగ్జిట్ సైన్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలి. నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసి అవి ఎల్లప్పుడూ పనిచేసే విధంగా ఉంచుకోవాలి. సిబ్బంది ఫైర్ ఎక్విప్‌మెంట్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలి. ప్రమాదం జరిగినప్పుడు గందరగోళ పరిస్థితి సృష్టించకూడదు. దుస్తులకు నిప్పంటుకుంటే పరుగెత్తకూడదు. నేలపై దొర్లడం లేదా దుప్పటి చుట్టుకోవడం మంచిది. కాలిన శరీర భాగంపై చల్లని నీరు పోయాలి. విద్యుదాఘాతం వల్ల జరిగే ప్రమాదాల్లో మంటలు ఆర్పేందుకు నీటిని ఉపయోగించరాదు. గదిలో మంటలు వ్యాపించి ఉన్న సమయంలో ఒక్కసారిగా తలుపులు తీయకూడదు. ప్రమాద స్థలం నుంచి బయటకు వచ్చాక ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి వెళ్లకూడదు. లిఫ్ట్, ఎస్కలేటర్స్‌ను ఉపయోగించకపోవడం ఉత్తమం. వేడి, పొగ ఎక్కువగా వ్యాపించినప్పుడు వీలైనంత కిందగా నేలపై పాకుతూ బయటపడాలి. 101 నంబర్‌కు ఫోన్ చేసి అగ్నిమాపక శాఖకు సమాచారమివ్వాలి.



పొదలకూరులో కాలిపోయిన గడ్డివామి (ఫైల్)

సింహపురి ప్రీమియర్ లీగ్ ప్రారంభం



పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా సింహపురి ప్రీమియర్ లీగ్ టీ20 టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశాయి. ఆదివారం బుజబుజనెల్లూరులోని సీఏఏ క్రీడా మైదానంలో పోటీలను ఏసీఏ మౌలిక సదుపాయాల చైర్మన్ పి.విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ దోహదపడుతుందన్నారు. క్రీడాకారులందరూ అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌డీసీఏ సంయుక్త కార్యదర్శి కె.గిరీష్, కోశాధికారి ఎస్‌కే అబూబకర్, కేర్ టేకర్ శ్రీనివాసరెడ్డి, ఏసీఏ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ వంశీకుమార్, అసోసియేషన్ సభ్యులు కె.శ్రీనివాసులు, లీలామోహన్‌రెడ్డి, ఎస్.రాజశేఖరరెడ్డి, మదీనా వాచ్ కంపెనీ అధినేత ఇంతియాజ్ పాల్గొన్నారు.

తొలిరోజు

ఈ టోర్నమెంట్‌లో 8 జట్లు పోటీ పడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు గూడూరు రాయల్ చాలెంజర్స్, ఆత్మకూరు రేంజర్స్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో గూడూరు జట్టు గెలుపొందింది.

అప్పులపై తండ్రి ప్రశ్నించడంతో..

- యువకుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): అప్పులు ఎందుకు చేశావని తండ్రి ప్రశ్నించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు ఎటో వెళ్లిపోయిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌లో శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటోంది. అతడి కుమారుడు ఉదయ్ కిరణ్ చెన్నైలో బీటెక్ పూర్తిచేసి ఈనెల 2వ తేదీన ఇంటికి వచ్చాడు. అయితే ఉదయ్ కిరణ్ అప్పులు చేసి వచ్చాడని అతడి స్నేహితులు అదేరోజు రాత్రి శ్రీనివాసులుకు ఫోన్ చేసి చెప్పారు. అప్పు ఎందుకు చేయాల్సి వచ్చిందని తండ్రి ప్రశ్నించడంతో మనస్తాపానికి గురైన ఉదయ్ కిరణ్ 3వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించగా జాడ తెలియరాలేదు. ఈ మేరకు శ్రీనివాసులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై నెల్లూరు దర్గామిట్ట పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. బీవీనగర్‌కు చెందిన ఓ బాలిక దర్గామిట్టలోని ఓ విద్యా సంస్థలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటోంది. ఈనెల 4వ తేదీన ఆమె కోచింగ్ సెంటర్‌లోకి వెళ్తుండగా మెట్ల మార్గంలో అదే బిల్డింగ్‌లోని ఓ ఇన్సురెన్స్ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డి మాటలు కలిపాడు. తాను ఉన్నత చదువులు చదివానని, కెమిస్ట్రీలో ఏమైనా సందేహాలుంటే తీరుస్తానని చెప్పాడు. బాలిక ఆ మాటల్ని వినకుండా వెళ్తుండగా అతను అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె ప్రతిఘటించి వెళ్లిపోయింది. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిపై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

రెండు కేజీల బంగారం స్వాధీనం

- కేంద్ర దర్యాప్తు అధికారుల అదుపులో 'చాట్ బండి' నిర్వాహకుడు

నెల్లూరు(క్రైమ్): కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు నెల్లూరు కాపువీధికి చెందిన ఓ చాట్ దుకాణ నిర్వాహకుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. సెంట్రల్ ఎక్సైజ్ లేదా డీఆర్ఐ అధికారులో స్పష్టంగా తెలియదు గానీ ఆదివారం గూడూరు సమీపంలో బిల్లుల్లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు 2 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో అక్రమ రవాణాలో కాపువీధికి చెందిన ఓ చాట్ దుకాణ నిర్వాహకుడి ప్రమేయం ఉందని గుర్తించిన అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యాపారి పేరుకే చాట్ దుకాణం నిర్వహిస్తూ లోపల బంగారు వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియరావల్సి ఉంది.

మామిడితోట దగ్ధం

వింజమూరు(ఉదయగిరి): మోటుచింతల పాళెం సమీపంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ మామిడితోటలో కొంతభాగం దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పారు. తోటలో ఎండిన గడ్డి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో 20 చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు యజమాని దొరసానమ్మ తెలిపింది. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసింది.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగానో? బహిర్భూమికి వెళ్లిన సమయంలోనో.. స్పష్టమైన కారణం తెలియదు గానీ రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన నెల్లూరు వేదాయపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతురాలి వయసు 60 నుంచి 65 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. బులుగు రంగు మీద వైలెట్ రంగు పూతల చీర, వైలెట్ రంగు జాకెట్ ధరించి ఉంది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): యువతి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు సంతపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. గిడ్డంగి వీధిలో ఓ వ్యక్తి కుటుంబం నివాసం ఉంటోంది. అతడి కుమార్తె ఇంటర్మీడియట్ చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. రోజూ యువతి జిమ్‌కు వెళ్లి వచ్చేది. శనివారం సాయంత్రం జిమ్‌కు వెళ్లిన యువతి ఇంటికి తిరిగి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. జాడ తెలియరాకపోవడంతో బాధిత తండ్రి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సుల్తాన్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మారిన జీవనశైలితోనే ఆరోగ్య సమస్యలు

- పెరుగుతున్న బీపీ, షుగర్ జబ్బులు, గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లు
- అందని ద్రాక్షగా మారిన అందరికీ ఆరోగ్యం
- సంపాదనలో వైద్యానికి అధికంగా ఖర్చు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



నెల్లూరు(అర్బన్): మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో జిల్లాలో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. బీపీ, షుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, కేన్సర్, క్షయ లాంటి జబ్బుల బారిన పడే వారి సంఖ్య అధిక సంఖ్యలో ఉంది. ప్రజలు తమ ఆదాయంలో అధిక శాతం ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఖర్చు చేసి అప్పులపాలవుతున్న పరిస్థితులున్నాయి. ఇలాంటి విషయాలని 1950లోనే పరిశీలించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ సమాజం బాగుంటుందని పేర్కొంది. అందరికీ ఆరోగ్యం అనే నినాదాన్నిచ్చింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ స్థాపనకు గుర్తుగా ప్రతి ఏడాది ఏప్రిల్ 7వ తేదీని ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరపాలని అన్ని దేశాలకు పిలుపునిచ్చింది. సోమవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, సదస్సులు నిర్వహించబోతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 450 రిజిస్ట్రేషన్ కలిగిన హాస్పిటళ్లున్నాయి. అనధికారికంగా మరో 300 వరకు క్లినిక్‌లు నడుపుతున్నారు. హోల్‌సేల్, రిటైల్ కలిపి సుమారు 2 వేల మెడికల్ షాపులున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో 52 పీహెచ్‌సీలు, ఒక జిల్లా ఆస్పత్రి, 2 ఏరియా ఆస్పత్రులు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు, నెల్లూరు నగరంలో ఒక బోధనాస్పత్రి (జీజీహెచ్) ఉన్నాయి. ఇవేకాక ఆయుర్వేద హాస్పిటళ్లున్నాయి. వీటిల్లో సుమారు 2,500 మంది వరకు డాక్టర్లు వైద్యసేవలందిస్తున్నారు.

పెరుగుతున్న రోగులు

జిల్లాలో సుమారు 27 లక్షల మంది జనాభా ఉన్నారు. 15 వేల మంది కేన్సర్ రోగులున్నట్లు అంచనా. 5.50 లక్షల మంది బీపీ, షుగర్ రోగులున్నారు. కిడ్నీ, లివర్ సమస్యలతో బాధపడే వారు 6 వేల మంది వరకూ ఉన్నారు. గత సంవత్సరం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లోనే 4,055 మందికి టీబీ ఉన్నట్లు నిర్ధారణ అయింది. బయట ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న రోగులు మరికొంత ఉంటారు. అలాగే పెద్ద సంఖ్యలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయి. వీరు మంచానికి పరిమితమవుతున్నారు. ఇంకా పలురకాల జబ్బుల బారిన పడుతున్నారు.

ఇవి తింటే..

సీజనల్‌గా లభించే తాజా పండ్లను ఆహారంగా తీసుకోవాలి. ఆకుకూరలు, కాయగూరలు భోజనంలో భాగం కావాలి. కలుషితం లేని రక్షిత నీటిని ఎక్కువగా తాగాలి. గింజలు (వేరుశనగ, పెసలు, శనగలు, ఉలవలు) లాంటి వాటిని రెగ్యులర్ ఆహారంలో భాగం చేసుకోవాలి. ప్రతి మనిషి ఏడు గంటలు నిద్ర పోవాలి. సాయంత్రం భోజనం 7 నుంచి 8 గంటల్లోపే ముగించాలి. పని ఒత్తిడి తగ్గించుకోవాలి. తగిన వ్యాయామం చేయాలి. కంప్యూటర్, ఫోన్ లాంటి స్క్రీన్లకు అతుక్కుపోరాదు. పాలి ష్ బియ్యం బదులు ముడి బియ్యం ఆరోగ్యానికి మంచిది. కల్తీ లేకుండా ఉండేందుకు నువ్వుల నూనె, వేరుశనగ లాంటి నూనెలు స్వయంగా మిల్లు వద్దకు వెళ్లి ఆడించుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. రిఫైన్డ్ ఆయిల్‌కు దూరంగా ఉండటం శ్రేష్ఠం. పొగాకు, మద్యం జోలికెళ్లరాదు. తద్వారా మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చు. ప్రజల ఆరోగ్యం.. ప్రజల చేతుల్లోనే అనే నినాదాన్ని నిజం చేయొచ్చు.

మంచి అలవాట్లే శ్రీరామరక్ష



మంచి ఆహారపు అలవాట్లే శ్రీరామరక్ష. జంక్ ఫుడ్ మానేయాలి. ఇంట్లోనే తాజాగా ఆహార పదార్థాలను తయారు చేసుకుని తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గింజలు లాంటివి తీసుకుంటే మంచిది. ఒత్తిడిని తగ్గించుకోవడం, తగినంత నిద్రపోవడం అవసరం. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. బీపీ, షుగర్ ఉండే వారు వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి. లేదంటే స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ పెద్దాస్పత్రి, నెల్లూరు

నిధులు అధికంగా కేటాయించాలి



ప్రజలకు ఆరోగ్యాన్ని అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఆరోగ్యం కోసం అధికంగా ఖర్చు చేసి ఆస్తులను అమ్ముకున్న పేద, మధ్యతరగతి ప్రజలు ఎంతోమంది ఉన్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి అధికంగా నిధులు కేటాయించాలి. స్పెషలైజేషన్ వైద్య సేవలు ప్రభుత్వ రంగంలో పూర్తి స్థాయిలో అందించాలి. పేదలకు పౌష్టికాహారం అందేలా చూడాలి. ప్రజారోగ్యంపై ప్రజలను చైతన్యం చేయాలి.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్రాధ్యక్షుడు, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల

బ్యాంక్ అధికారిపై దాడి

- ముగ్గురిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): బ్యాంక్ అధికారిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులపై నెల్లూరు సంతపేట పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పడారుపల్లికి చెందిన జి.నరసింహులు బృందావనంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పని చేస్తున్నాడు. శనివారం ఆయన బ్యాంక్‌లో ఉండగా ఖాతాదారుడైన ఇస్కాన్ సిటీకి చెందిన ఐతా మల్లికార్జునగౌడ్ ఫోన్ చేశాడు. నరసింహులు విధి నిర్వహణలో బిజీగా ఉండటంతో లిఫ్ట్ చేయలేదు. కొద్దిసేపటి అనంతరం నరసింహులు అతడికి ఫోన్ చేశారు. కాల్ లిఫ్ట్ చేయలేదన్న విషయమై వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన మల్లికార్జునగౌడ్ మరో ఇద్దరితో కలిసి బ్యాంక్‌కు చేరుకుని నరసింహులుపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో బాధితుడు జరిగిన విషయాన్ని చీఫ్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాడు. వారు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మల్లికార్జునగౌడ్‌తో పాటు మిగిలిన ఇద్దరిపై రాత్రి కేసు నమోదైంది. కాగా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో కేసు నమోదులో పోలీసులు తీవ్ర జాప్యం చేశారని బ్యాంక్ అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.110
సన్నవి	: రూ.80
పండ్లు	: రూ.50



నేత్రదానం



నేత్ర దాత సాయికిరణ్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని కావలి పట్టణం విష్ణాలయం వీధికి చెందిన నల్లూరు. లక్ష్మీకాంతమ్మ (70) శనివారం రాత్రి మృతిచెందారు. వాసవి వనిత లెజెండ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత సహకారంతో మృతురాలి నేత్రాలను కుటుంబ సభ్యుడు శేషగిరిరావు జిల్లా ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ నేత్రాలను సేకరించారు. ఆదివారం నేత్ర దాన సర్టిఫికెట్ అందించారు.

- జలదంకి మండలం బీకే అగ్రహారానికి చెందిన పులివెందుల సాయికిరణ్ (22) ఆదివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుడు యానాదయ్య సాయికిరణ్ నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. నేత్రాలను సేకరించిన ఐ టెక్నీషియన్ సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు.



లక్ష్మీకాంతమ్మ కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న ఐ టెక్నీషియన్

- నెల్లూరు నగరంలోని సరస్వతి నగర్‌కు చెందిన పొన్నాల వెంకటరామిరెడ్డి (80) ఆదివారం మృతిచెందాడు. నరేష్ చంద్రారెడ్డి సహకారంతో కుటుంబ సభ్యుడు, రోటరీ క్లబ్ సెక్రటరీ అయిన పొన్నాల అఖిలేష్‌రెడ్డి వెంకటరామిరెడ్డి నేత్రాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకున్న వారు 99124 70094, 99595 89321, 95508 56868 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడులు

అల్లూరు: పేకాట స్థావరంపై దాడులు చేసి ఐదుగురు వ్యక్తులను పట్టుకున్న ఘటన అల్లూరు మండలం ఇందుపూరు గ్రామంలో ఆదివారం జరిగింది. అల్లూరు ఎస్సై కిశోర్‌బాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందుపూరు గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.3,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 113
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 202
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 226
లేయర్ చికెన్	: 170

